క్లుప్తంగా

పంటల బీమా మంజూరు

సింహాద్రిపురం : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో పంటల బీమా మంజూరైందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 2022 ఖరీఫ్ పంటలైన చీనీ, పత్తి, ఉల్లి, కంది, వేరుశనగ పంటలకు వాతావరణ బీమా మంజూరైందని.. ఇందులో చీనీకి మండల వ్యాప్తంగా 17035 ఎకరాలకుగానూ రూ.16.35 కోట్లు మంజూరైందని.. ఈకేవైసీ, ఈ–క్రాప్ చేసుకున్న రైతుల జాబితాను ఆయా ఆర్‌బీకేలలో ప్రదర్శించడం జరిగిందని.. రైతులు తమ పేర్లను చెక్ చేసుకోవాలన్నారు. పేర్లు ఉన్న రైతులకు ఆయా పంటలకు ఒక వారంలో వారి ఖాతాలలో డబ్బులు జమ అవుతాయన్నారు. చీనీ పంటకు రూ.9,600లు, ఉల్లికి రూ.10,180లు, వేరుశనగ పంట రూ.6239లు, పత్తి (వర్ష ఆధారిత) పంటకు రూ.8882లు, పత్తి (బోర్ల కింద సాగు) పంటకు రూ.14,667లు, శనగ పంటకు రూ.812లు ఎకరాకు చొప్పున పంటల బీమా మంజూరైందన్నారు. తొలి ఏకాదశి పండుగ రోజున రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో పంటల బీమా మంజూరైందన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

చక్రాయపేట : చక్రాయపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి అన్నమయ్య జిల్లా గాలివీడు కు 132 కేవీఏ నూతన లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శని ఆది వారాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎల్‌సీ తీసుకోవడం జరుగుతందని చెప్పారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి 8 గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీమనోహర, శ్రీమహాలక్ష్మి ఫర్టిలైజర్స్ సౌజన్యంతో విజిల్స్ డ్యాన్స్ అకాడమి, కడప చిన్నారులచే నిర్వహించిన జానపద, వెస్టన్ నృత్యాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, శిల్పారామ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి వితరణ

చక్రాయపేట : మండలంలోని చిలేకాంపల్లె సీతారామపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాలయానికి రూ.30 వేలు విరాళంగా కర్నూలు జిల్లా గోకులపాడు గ్రామానికి చెందిన భక్తులు బండారు పెద్ద మద్దిలేటి, బండారు మద్దిలేటి, బండారు వెంకటేశ్వర్లు మొత్తాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ బృందం తెలిపారు.

ఆర్‌బీకేలు రైతులకు వరం

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరంగా మారాయని జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మీదిపెంట్ల రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ఏడీఏ అశోక్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఆయా సీజన్లల్లో పంటల సాగుకు అవసరమైన ఎరువులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయన్నారు. అలాగే కొర్రలు, కందులను రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని సాగుకు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల బీమా జాబితా విడుదల

చక్రాయపేట : గత యేడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేస్తున్న పంట బీమా వివరాల జాబితాను రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసినట్లు మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు తెలిపారు. గత ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి ఈక్రాప్ చేయించుకున్న రైతులకు మాత్రమే బీమా నిధులు అందుతాయన్నారు. పేర్లు, విస్తీర్ణ వివరాలు తప్పుగా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం, రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గురువారం పట్టణానికి చెందిన కోలా ఎద్దుల కొండయ్య వర్ధంతి సందర్భంగా కుమారుడు కోలా మారుతి వరప్రసాద్, కోడలు అరుణాదేవిల ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ



పులివెందులలో ప్రత్యేక ప్రార్థనలలో ముస్లింలు



కమలాపురంలో సందేశం వింటున్న ముస్లింలు



జమ్మలమడుగులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, ప్రసంగిస్తున్న పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ

పులివెందుల టౌన్ : బక్రీద్ పండుగను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి స్థానిక శ్రీరామాహాల్ వద్ద ఉన్న పాత ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు, జామియా మసీద్ తదితర మసీదులలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం 10 గంటల వరకు పార్నపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మత పెద్దలు బక్రీదు పండుగ గురించి వివరించారు. త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. దానధర్మాలు చేయడం అలవరచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు కుర్బాని ఇవ్వాలని వారు సూచించారు. అనంతరం దానధర్మాలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధు, మిత్రులకు విందులు ఏర్పాటు చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంతో పాటు మండల పరిధిలోని జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, మొలకవారిపల్లె, విభరాపురం, గంగవరం, అప్పాయపల్లె, సి.గోపులాపురం తదితర గ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. హాఫిజ్ సయ్యద్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించారు. అలాగే దర్గా మస్జిద్‌లో పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ ఆచరించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక రామిరెడ్డిపల్లె రహదారిలోని ఈద్గా, నవాజ్ కట్ట ప్రాంతాలలో వేరువేరుగా ముస్లింలు సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థానయే పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ, కమాలియా ఆస్థానయే పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీలు మాట్లాడుతూ ప్రతి మనిషి త్యాగాలు చేయటానికి సిద్దపడినప్పుడే దేవుడు కూడా వారికి ప్రాప్తి కల్పిస్తాడు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికి ఒకరు అలింగనం చేసుకుని బక్రీద్‌శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద పోలీసులు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని అస్థాన ఏ గౌసియా పీఠాధిపతి తనయుడు సయ్యద్ షా తాహీర్ పీరా ఖాద్రీ అన్నారు. గురువారం బక్రీద్ పండగను మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలోని గౌసియా షాహి ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక వలసపల్లి రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటక్రిష్ణయ్య బందోబస్తు నిర్వహించారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొండూరు, మల్లేల, బోడివారిపల్లె తదితర గ్రామాల్లోని ఈద్గా మైదానాలలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని వల్లూరు, పెద్దపుత్త, దిగువపల్లె, తప్పెట్ల, తోల్లగంగనపల్లె, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, కోట్లూరు, గణేష్‌పురం తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం, కొండూరు, వెల్లటూరు, తిప్పిరెడ్డిపల్లె, గంగనపల్లె తదితర గ్రామాలల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండల పరిధిలోని కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, వెంకటాపురం, బెడుదూరు, యనమలచింతల పలు గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా మైదానంలోప్రార్థనలు నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : లింగాల, వెలిదండ్ల, పార్నపల్లె, పెద్దకుడాల, చిన్నకుడాల, ఇప్పట్ల, అంబకపల్లె, మురారిచింతల గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా ఉన్న ఈద్గా మైదానాలలో గురువారం ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత గురువులు ముల్లావల్లి, రఫి, నాగూర్‌లు బక్రీద్ పండుగ, ఖుర్బాని గురించి తెలిపారు. బక్రీద్ పండుగ రోజు ఖుర్బాని ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని పండుగ రోజుతోపాటు మూడు రోజులు ఈ ఖుర్బాని ఇవ్వవచ్చునని తెలిపారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పులివెందుల రోడ్డులోని బిస్మిల్లా మసీదులో, ఖాదీఖానా వద్ద ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండుగ సందేశాన్ని ఇచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ బందోబస్తు నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : బక్రీదు పర్వదిన వేడుకలను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా ముస్లింలు బక్రీదు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదుకట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

రైతును ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రైతును అన్ని విధాలా ఆదుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట తొలి ఏకాదశి, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వర్షానికి ఖరీఫ్‌కు సంబంధించి దెబ్బతిన్న పంటల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని దీనిపై ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి నష్టాన్ని అంచనా వేయాలని చూసించిందన్నారు. జిల్లాలో ఎక్కువగా పంట దెబ్బతిన్న ప్రాంతం కమలాపురం నియోజకవర్గం. అందులో వీరపునాయునిపల్లె అత్యధికమని తెలిపారు. జిల్లాకు రూ.200 కోట్లు మంజూరవగా అందులో ఒక్క వీరపునాయునిపల్లె మండలానికి రూ.17 కోట్లు మంజూరైందన్నారు. కంది, పత్తి, ఉల్లి, చీనీ, వేరుశనగ పంటలకు మంజూరైనట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా నష్ట పరిహారం అందించలేదన్నారు. 2012లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పరిహారం కొరకు మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో పలు మార్లు ధర్నాలు చేశారన్నారు. రైతులను సకాలంలో ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల తరపున దన్యవాదాలు తెలిపారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డిని రైతులు ఘనంగా సత్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండారెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మండల రైతు సంఘం నాయకుడు భాస్కర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న మెగా లేఅవుట్ పరిశీలన



జగనన్న మెగా లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న జగనన్న మెగా లేఅవుట్‌ను గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం జగనన్న లేఅవుట్‌లో డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 4వేల ఇళ్లను నిర్మించేందుకు అంగీకారం తెలిపిందన్నారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులచేత రూ.35వేల రుణం చెల్లించని వారు సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జగనన్న లేఅవుట్‌కు సంబంధించిన మ్యాప్‌ను డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ మేనేజర్, సైట్ ఇంజనీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైద్యసేవలు మరువలేనివి

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ అగస్టీన్ రాజు, కంటి వైద్యులు కె.పి రవీంద్రలు క్యాంబెల్ వైద్యశాల నుంచి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరవలేనివని గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణ రెడ్డి అన్నారు. గురువారం క్యాంబెల్ వైద్యశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో గడియారం సాహితీపీఠం ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

వేంపల్లె : 2023–24 విద్యా సంవత్సరానికి గానూ డిగ్రీలో ప్రవేశాల కొరకు జులై 5వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో ప్రత్యేకంగా వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర నాయకత్వంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2020 నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అన్ని డిగ్రీ కళాశాలల్లో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని.. గతంలో మాదిరిగానే డిగ్రీలో బీఎస్సీ, బీఏ, బీకాంలలో సాంప్రదాయ కోర్సులు కాకుండా మేజర్, మైనర్ సబ్జెక్టులను కొనసాగించనున్నామన్నారు. ఉదాహరణకు బీఎస్సీలో మ్యాథమెటిక్స్, బీఎస్సీలో ఫిజిక్స్, బీఏలో హిస్టరీ, బీకాంలో కంప్యూటర్స్ లాగా కొత్త విధానాన్ని ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక బీఎస్సీ హానర్స్, బీకాం హానర్స్, బీఏ హానర్స్‌లు కూడా కొనసాగుతాయన్నారు. ఈ హెల్ప్ డెస్క్‌లో నూతనంగా కళాశాలలో చేరే విద్యార్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత పరిధిలోని విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9491947599, 9052311737, 9493013077, 8309321757 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



పులివెందులలో సతీసమేత కల్యాణ సత్యనారాయణస్వామి

పులివెందుల టౌన్ : తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వెంకటేశ్వరస్వామి, అమ్మవారిశాల తదితర ఆలయాల్లో ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ భూలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని, కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. జూటూరు నాగసు గుణాకర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తూ స్వామివారికి తాకించి అమ్మవార్ల మెడలో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముందుగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి వ్రతం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ.. కథలను చదివి వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, డీఈ గంగయ్య, ఈఓ రమణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేంపలెలో..

వేంపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై ఉన్న శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఆలయం, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు అచ్యుత నారాయణ, హరి ప్రవీణ్‌లు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేంపల్లె పట్టణానికి చెందిన భక్తులు పబ్బతి సురేష్‌బాబు ధర్మపత్ని లక్ష్మీ రూ.20వేలు విలువ చేసే ముత్యాల కిరీటం, ముత్యాల తోరణం, వింజామర్లు స్వామివారికి సమర్పించారని ఆలయ ఈఓ తెలిపారు.

ఘనంగా గ్రామోత్సవం

జమ్మలమడుగు : ఆశాడమాసంలో తొలి ఏకాదశి సందర్భంగా రుక్మిణి పాండురంగలస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం స్థానిక రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో భావసార క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించి అనంతరం ఘనంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండల వ్యాప్తంగా తొలి ఏకాదశిని పురష్కరించుకుని ప్రజలు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. పైడికాలువలోని శ్రీ రాజ్య లక్ష్మీ చెన్న కేశవ ఆలయంలో అభిషేకాలను, అర్చనలను నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని అన్ని ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని పలు ఆలయాల్లో ఘనంగా తొలి ఏకాదశికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిడివెల్ల ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదనరావు ఆధ్వర్యంలో గురువారం స్వామివారికి పుణ్యాహకవాచనం, గణపతిపూజ, పంచామృతాభిషేకం, విశేష అలంకారం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

కమలాపురంలో.

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన సేవకుడు సత్య సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రదీప్ శర్మ, జగదీష్ శర్మ ఆచారత్వమున ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి, సమస్యలపై సమీక్ష

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల అభివృద్ధి, సమస్యలపై పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా మండల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని.. మండలంలో సమస్యలు, అభివృద్ధిపై వారు ముందుగానే అడిగి తెలుసుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం కొరకు ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. చిత్రావతి నుంచి వచ్చే తాగునీరు దుర్వాసనతో వస్తున్నాయని వీటితోపాటు పలు సమస్యలపై ఆయనకు ప్రజాప్రతినిధులు అర్జీల రూపంలో విన్నవించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, డీటీ వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవే ధ్యేయంగా ముందుకు సాగాలి

పులివెందుల టౌన్ : సేవా కార్యక్రమాలే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సంస్థ తమ కార్యకలాపాలతో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. గురువారం స్థానిక పులివెందుల పెన్షనర్ల హోంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రాఘవరెడ్డి అధ్యక్షతన సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ప్రొద్దుటూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి.శ్రీనివాసులు, సెంట్రల్ కమిటీ నాయకులు గోపి, వీరారెడ్డి, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చక్రపాణిరెడ్డి, కొండారెడ్డి, రాఘవరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, చవ్వా కృష్ణారెడ్డి, శేష మహేశ్వరమ్మలు హాజరయ్యారు. అనంతరం సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎస్.సుబ్బరాయుడు, కార్యదర్శిగా చంద్రశేఖరరెడ్డి, కోశాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలుగా పద్మావతి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రవిశంకర్, భాస్కరరెడ్డి, గంగిరెడ్డి, మరకా సూర్యనారాయణరెడ్డిలచే ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు.

వైభవంగా గంగమ్మతల్లి వార్షికోత్సవం



ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మ తల్లి 26వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారికి అభిషేకాలు, పూజలను వేద పండితులు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.